# విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 12 నవంబరు 2024 8 పేజీలు


## పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిపెట్టండి

### - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**విశాలాంధ్ర -చిత్తూరు:** పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిద శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఆర్ఓ కె. మోహన్ కుమార్, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులులతో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

2

## భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించండి

### - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి

**విశాలాంధ్ర - తిరుపతి :** భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి పెంచల య్యలు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని భారత పార్లమెంటులో ఏఐటియుసి ఆధ్వర్యంలో ప్రైవేటు బిల్లు పెట్టి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని సాధించడం జరిగిందని. 2006 వ సంవత్సరంలో రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అమలు పరచడం జరిగిందని- ఆ తరువాత వచ్చిన చంద్రబాబు నాయుడు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టంలోని డబ్బులను దాదాపుగా 2019 కోట్ల రూపాయల ధనాన్ని ఇతర అవసరాలకు ఆర్భాటాలకు ఇతర పథకాలకు మళ్లించుకోవడం జరిగిందని దానిని వెంటనే తిరిగి జమ చేయాలని.. ఈరోజు రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బడ్జెట్ను ప్రవేశపెడుతున్నారని ఈ బడ్జెట్లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వంప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు మరి యు కార్మిక వర్గానికి అత్యధిక నిధులు కేటాయించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని వారు అన్నారు.. ఆటో కార్మికులకు ఇన్సూ రెన్స్ 50% తగ్గిస్తామన్నారు వాహన కొనుగోలులు రాయచూరు ఇస్తామన్నారు.

2

రైతులకు...

## పెట్టుబడి సాయం ఇవ్వాలి

### - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు

**విశాలాంధ్ర - సూళ్లూరుపేట:** ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రకటించిన 20 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని వెంటనే వారికి ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.రామానాయుడు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం వద్ద రైతులతో ఆందోళన నిర్వహించిన ఆయన ఆ తర్వాత రెవెన్యూ డివిజనల్ అధికారి కిరణ్మయికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ, కోస్తా ప్రాంతంలో సరైన సాయం చేయక పోవడం వల్ల 12 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేయక బీడు భూములుగా వదిలేశారని, కనుక వెంటనే ఎన్నికల సమయంలో ప్రకటించిన రైతు పెట్టుబడి సాయం 20 వేల రూపాయలను ఇవ్వాలని అదేవిధంగా రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ప్రకటించి

2

## ముఖ్యమంత్రిని కలిసిన టీటీడీ చైర్మన్

**విశాలాంధ్ర - తిరుమల కల్చరల్:**

ఏపీ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో టీటీడీ చైర్మన్ బీ.ఆర్. నాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్గా ప్రమాణం చేశాక తొలిసారి ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి ధన్యవాదాలు తెలియజేసి స్వామి వారి ప్రసాదాలు, పుష్పగుచ్ఛం అందించారు. భక్తులకు స్వామి వారి దర్శనం, అన్నప్రసాదాలు, వసతి సౌకర్యాలపై రాజీ లేకుండా సేవలు అందించాలని ముఖ్యమంత్రి టీటీడీ చైర్మన్ కు సూచించారు.

2

## వారిద్దరూ స్నేహితులే !

- యల్లమంద గ్రామంలో బాలికపై అత్యాచారం జరగలేదని తేలింది
- బాలిక వాంగ్మూలం, పూర్తి ఆధారాలతో కేసును ఛేదించిన పోలీసులు
- బాలుడు, బాలిక ఇద్దరూ పదోతరగతి విద్యార్థులే
- సున్నితమైన అంశాలపై అసత్య ప్రచారాలు చేయొద్దు
- విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు

విశాలాంధ్ర - తిరుపతి: యర్రావారిపాళెం, యల్లమంద గ్రామ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి ఆధారాలతో బాలికను విచారించగా బాలికపై అత్యాచారం జరగలేదని తేలిందని జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. పదో తరగతి చదువుతున్న బాలుడు, బాలిక స్నేహితులని, ఈ నెల 4వ తేదీ సాయంత్రం ముందుగానే అనుకున్న ప్రకారం స్కూల్ నుండి ఇంటికి వెళ్లే మార్గంలో కలుసుకున్నారు.

2లో

## 18న గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన

### - సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

**విశాలాంధ్ర - వెంకటగిరి :** ప్రస్తుత కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆ ఇళ్ళ నిర్మాణం కోసం ఐదు లక్షలు మంజూరు చేస్తానని హామీఇచ్చారు. ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. సోమవారం వెంకటగిరిలోని సిపిఐ కార్యాలయంలో వెంకటగిరి నియోజకవర్గ సమితి సమావేశం జై కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమితి సమావేశమునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాలని లేకుంటే గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య పెద్ద తేడా ఏమీ కనిపించదని ఆయన అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి సిమెంటు, ఇసుక, ఇనుము, ఇటుక, కంకర ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాల న్నారు.

3లో

## చట్టాన్ని పునరుద్ధరించండి

**(మొదటి పేజీ తరువాయి)** హమాలీ కార్మికులకు సంక్షేమ చట్టాన్ని చేస్తామన్నారు. ఆ సంక్షేమ చట్టంలోని వీధి వర్తక వ్యాపారులు ఆటో కార్మికులు హమాలీ కార్మికులు రాష్ట్రం లో ఉన్న అసంఘటితరంగా కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఏఐటీయూసీ పోరాడుతుందని వారు అన్నారు అలాగే ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు. ఎన్. చంద్రశేఖర్ రెడ్డి. పివిఎమ్ రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్యలు మాట్లాడుతూ ఆశా కార్మికులకు అంగన్వాడీ కార్మికులకు స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించడం ద్వారా భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ క్లైములు పరిష్కారం అవుతాయని. భవన నిర్మాణ కార్మికుల పిల్లల చదువులకు పెళ్లిళ్లకు ప్రసవాలకు కుటుంబాలకు అండగా ఉంటూ. ఆ కుటుంబాలకు డబ్బులు చేరుతాయని అలాగే ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుందని ఇలాంటి క్లైములు ఈ జిల్లాలో చాలా ఎక్కువగా పెండింగ్ ఉన్నాయని అవి పరిష్కారం అవుతాయని.. అలాగే భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి పనులు దొరకక అనేక ఇబ్బందులు పడుతున్నారని. ఇసుకను సులభతరం చేయాలని. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి దొరకాలని కుటుంబాలకు వస్తు లేకుండా ఉండాలని అందుకు చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని ఇతర రాష్ట్రాలకు ట్రిప్పర్లలో తోలుతున్న ఇసుకను అరికట్టాలని.. తిరుపతి ప్రాంతాలలో భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని వారు ఉండటానికి పెద్ద షెడ్లు నిర్మాణం చేపట్టాలని అక్కడవారు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ధర్నా అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌కి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ ఐటియుసి జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎన్.డి.రవి సి.హెచ్. శివకుమార్, కే.వై.రాజా, వై.ఎస్. మనీ, శివ, చంద్రబాబు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కార్తీక్, శెట్టిపల్లి రవి, హరిబాబు,మోహన్ రెడ్డి, సుశీల, పార్వతి, వెంకటేష్, సురేష్ , రైల్వే బాల, ఆర్. వి. రమేష్, శ్రీనివాసులు, కృష్ణ, మేస్త్రి బాబు, అల్లా బకస్, నాగరాజు, రాము, బలరాం, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రత్యేక దృష్టిపెట్టండి

**(మొదటి పేజీ తరువాయి)** ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ ఎస్ అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులు పనిచేయాలని, ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగుతుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వారిద్దరూ స్నేహితులే !

**(మొదటి పేజీ తరువాయి)** అక్కడ ఆలస్యం కావడంతో తమ తల్లిదండ్రులు తమను వెతుక్కుంటూ వస్తున్నారని తెలుసుకున్న వీరు పథకం ప్రకారం తమ తల్లితండ్రుల వద్ద తమ వ్యవహారాన్ని కప్పిపుచ్చాలనే ఉద్దేశ్యంతో తమపై ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ముసుగు వేసుకుని ఒక మోటారు సైకిల్ పై వచ్చి దాడి చేశారని, తల్లిదండ్రులతో చెప్పినది. తరువాత తల్లిదండ్రులు ఆ అమ్మాయిని యల్లమంద ప్రాథమిక వైద్య కేంద్రానికి తీసుకొని వెళ్లారు. అదే సమయంలో పోలీసు వారికి అందిన సమాచారంపై స్థానిక యర్రావారిపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్ సిబ్బంది మరియు భాకరాపేట సిఐ సత్యనారాయణ అక్కడికి చేరుకోవడం జరిగింది. ప్రాథమిక వైద్య కేంద్రంలో ఉన్న మహిళా నర్స్, డాక్టర్ సహకారంతో ప్రాథమిక సమాచారాన్ని సేకరించడానికి ప్రయత్నించారు. తదుపరి ఉత్తమ చికిత్స నిమిత్తం మరియు వైద్య పరీక్షల నిర్ధారణ నిమిత్తం బాలికను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సహా తిరుపతిలోని మెటర్నిటీ హాస్పిటల్‌కు తరలించి అప్పటికప్పుడే వైద్యులతో తగిన నిర్ధారణ పరీక్షలు చేయించడం జరిగిందన్నారు. తదుపరి మహిళా డి.యస్.పి, తహసిల్దార్, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో, తల్లిదండ్రుల సమక్షంలో బాధితురాలిని విచారించి బాలిక యొక్క స్టేట్మెంట్ రికార్డు చేసి కేసు నమోదు చేయడం జరిగింది. విచారణలో తన స్నేహితుడు అయిన అబ్బాయిని కాపాడాలి అనే ఉద్దేశంతోనే ఈ విధంగా బాలిక కట్టుకథ చెప్పినట్లు తేలింది. తనను మందలిస్తారనే భయంతో బాలికే, తల్లితండ్రులు వచ్చేది గమనించి తన చేతికి ఉన్న గాజులతో తానే గాయం చేసుకొని ఎవరో ముసుగు వేసుకున్న వ్యక్తులు దాడి చేసి మత్తు మందు తాగించినారని వెల్లడించింది. అదేవిధంగా తల్లితండ్రులను నమ్మించింది. బాలిక వాంగ్మూలం ఆధారంగా తన తోటి విద్యార్థి, స్నేహితుడు అయిన మైనర్ అబ్బాయిని అదుపులోకి తీసుకొని, జువైనల్ హోమ్ కు తరలిస్తున్నామన్నారు. ఇదీ జరిగిన వాస్తవం. పోలీసులు ఎన్నో ఆటంకాలు ఎదురైనా సంయమనంతో దర్యాప్తు నిర్వహించి కేసును ఛేదించారని తెలిపారు. ఇటువంటి సున్నితమైన అంశంపై నిజా నిజాలు తెలుసుకోకుండా, దర్యాప్తు చేయుటకు పోలీసులకు కనీస సమయం ఇవ్వకుండా, ఎవరికి వారు కల్పిత వార్తలను అప్పటికప్పుడే స్వీయ అభిప్రాయాలు ఏర్పరుచుకొని కొంత మంది సోషల్ మీడియాలో, వార్తా చానళ్ళలో అసత్య ప్రచారాలు, వదంతులు వ్యాపి చేసి ప్రయోజనం పొందడం సబబు కాదని మరొక్కసారి జిల్లా ఎస్పి హెచ్చరించారు. ఈ కేసులో మైనర్ అమ్మాయి అవ్వడం వల్ల, చట్టం మేరకు సుప్రీం కోర్ట్ ఆదేశాల మేరకు, బాలిక యొక్క ఐడెంటిటీని గానీ, కుటుంబం యొక్క ఐడెంటిటీని గానీ ప్రచారం చేయడం చట్ట ప్రకారం ఉల్లంఘన అవుతుందని తెలియజేశారు. దుష్ప్రచారం చేసిన వారిని గుర్తించి, వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ మరియు నేర నియంత్రణ చేయుటకు పోలీస్ శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అన్ని వర్గాల వారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన, రవి మనోహర చారి శాంతిభద్రతలు, చంద్రగిరి డిఎస్పి ప్రసాద్, యర్రా వారి పాలెం పోలీసులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన టీటీడీ చైర్మన్

**(మొదటి పేజీ తరువాయి)** అలాగే ఏపీ డిప్యూటీ సీఎం కె.పవన్ కళ్యాణ్ , దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ని కలిసి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

## పెట్టుబడి సాయం ఇవ్వాలి

**(మొదటి పేజీ తరువాయి)** సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేయాలని, రాష్ట్రంలో సుమారు 40 వేలకు పైగా చెరువులకు మరమ్మతులు చేయక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అదేవిధంగా 21 వేలకు పైగా చెరువులు ఆక్రమణకు గురై ఉన్నాయని ఆయన తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. 32 మంది విద్యార్థుల ప్రాణత్యాగాలతో మరియు ప్రజా ప్రతినిధుల రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం కాకుండా నిలపాలని, ఉక్కు ఫ్యాక్టరీలో ఉక్కు మాత్రమే కాకుండా, ఉప ఉత్పత్తులుగా 20కి పైగా తయారవుతు న్నాయని, ఇటువంటి ప్రయోజనం కలిగించే ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.

**తడలో :** ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికారంలో కొస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రకటించిన 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వెంటనే వారికి ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామానాయుడు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం తడ మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో ఆందోళన నిర్వహించారు అనంతరం ఆయన తహశీల్దార్ శరత్ బాబుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ,కోస్తా ప్రాంతంలో రైతులకు సరైన ఆర్థిక సాయం చేయక పోవడం వల్ల 12 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేయక బీడు భూములుగా వదిలేశారని , అందుచేత వెంటనే ఎన్నికల సమయంలో ప్రకటించిన రైతు పెట్టుబడి సాయం 20 వేల రూపాయలను ఇవ్వాలని అదేవిధంగా రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ప్రకటించి సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేయాలని, రాష్ట్రంలో సుమారు 40 వేలకు పైగా చెరువులకు మరమ్మతులు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ,అదేవిధంగా 21 వేలకు పైగా చెరువులు ఆక్రమణ గురై ఉన్నాయని ఆయన తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. 32 మంది విద్యార్థుల ప్రాణత్యాగాలతో మరియు ప్రజా ప్రతినిధుల రాజీనా మాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం కాకుండా చూడాలని, ఉక్కు ఫ్యాక్టరీలో ఉక్కు మాత్రమే కాకుండా, ఉప ఉత్పత్తులుగా 20కి పైగా వస్తువులు తయారవుతు న్నాయని, ఇటువంటి ప్రయోజనం కలిగించే ఫ్యాక్టరీ ని ప్రైవేటు పరం చేయకుండా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సెక్రటరీ సిహెచ్ సుధాకర్ మండల సెక్రెటరీ కుమార్ జాయింట్ సెక్రెటరీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేయాలి

### కనీస మద్దతు ధర ప్రకటించండి : ఏపిరైతు సంఘం, ఏఐటియుసి

**విశాలాంధ్ర - తిరుపతి :** ఎన్నికల సందర్భగా రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి రైతాంగానికి పెట్టుబడి సాయ? 20,000 అందజేస్తామని ఇచ్చిన హామీ నేటికి అమలు చేయక పోవడం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం నేత , డా.టీ. జనార్దన్, పేర్కొన్నారు. .రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతిలో డా.టి.,జనార్దన్,బెల్లంకొండ.శ్రీనివాసులు, తవనంపల్లెలో రైతుసంఘం కార్యదర్శి కె..మునిరత్నం నాయుడు, నగరిలో రైతు నాయకులు భాస్కర్ రెడ్డి,మునిరత్నంరెడ్డి, వేలస్లు తహశీల్దార్లకు వేర్వేరుగా వినతి పత్రాలు అందేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మేరకే రైతాంగం ఓట్లు వేసి చంద్రన్నను గెలిపించారని నేడు హామీలు మరిచిపోవాలను కుంటే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. పెట్టుబడి సాయం ? 13,500 నుండి 20వేలకు పెంచి రైతన్నని ఆదుకుంటామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర అందజేయాలని కోరారు. జిల్లాలో కరువు మండలాల ప్రకటనలో వివక్ష తగదని తీవ్ర వర్షాభావ పరిస్థితుల లో పడమటి మండలాలు మొత్తం కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు .పాడి రైతులను ఆదుకునేందుకు వెంటనే విజయ డైరీని, సహకార చక్కెర కర్మాగారాలను పునః ప్రారంభించాలని, ఎన్నికల హామీ మేరకు మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కరువు నుండి శాశ్వత విముక్తి కోసం 40 ఏళ్ల క్రితం ప్రారంభించి, నేటికీ పూర్తికాని హంద్రీ-నీవా,గాలేరు-నగరి ప్రాజెక్టులకు బడ్జెట్లో ? 2000 కోట్లు చొప్పున కేటాయించాలని , విశాఖ ఉక్కు ను ప్రైవేటు చేయరాదని , కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని పేర్కొన్నారు. తిరుపతిలో రైతు నాయకులు కృష్ణదేవరాయలు,చిన్న సామి నాయుడు,చలపతి , నగరిలో భాషా, రాజేంద్ర, తవనం పల్లెలో బాలకృష్ణమ నాయుడు, గోపి,రాజేంద్ర బాలరాజ, రామచంద్ర, , తదితరులు పాల్గొన్నారు.

## గువ్వల రమేష్ రెడ్డిచే అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ

**విశాలాంధ్ర - చౌడేపల్లి :** చౌడేపల్లి మండలం గడ్డంవారిపల్లి పంచాయతి బత్తలాపురం నందు పలు అభివృద్ధి పనులకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి భూమి పూజ చేశారు గ్రామంలోని మహిళలు ఆయనకు హారతి పల్లాలతో స్వాగతం పలికారు ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ చంద్రన్న ప్రభుత్వం ప్రతి ఒక్కరికి మేలు చేకూరుస్తుందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమములో తెలుగుదేశం పార్టీ నాయకులు పూల చంద్రమౌళి బోయకొండ సుబ్బు చంద్రన్న సోషియల్ మీడియా కళ్యాణ్ గిరి నాయుడు మండల నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 18న గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన

**(మొదటి పేజీ తరువాయి)** ఫ్రీ ఇసుక విధానం సక్రమంగా అమలు జరపాలని అందరికీ ఇసుక అందుబాటులో ఉండే విధంగా కఠినంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన లేఔట్లను మార్పు చేసి గ్రామీణ పేదలకు మూడు సెంట్లు పట్టణ పేదలకు రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలలో కేటాయించాలని, అవసరమైన రోడ్లు, విద్యుత్తు, త్రాగునీరు, డ్రైనేజీ పారుదల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని, వీటన్నిటి సాధన కోసం సిపిఐ పెద్ద ఎత్తున లబ్ధిదారులను గుర్తించి పోరాటానికి సిద్ధం చేయాలన్నారు. అలాగే టిడ్కో ఇండ్ల లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను కూడా పూర్తి చేసి సత్వరమే ప్రతి లబ్ధిదారునికి ఇళ్లు అందేలా చూడాలన్నారు. దేశంలో రాజకీయాలు రోజురోజుకీ మార్పు చెందుతున్నాయని ఎన్నికలకు ముందు మోడీ 400 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ దేశ ప్రజలు మోడీ పాలన తిరస్కరించి ఇతర పార్టీలు మద్దతుతో పాలన ఏర్పాటు కలిగిందంటే మోడీ యొక్క నిరంకుశ పాలన ఏ విధంగా ఉందో స్పష్టమైందన్నారు. గతంలో ఏ అజెండా మోడీ అనుకున్నారో ఆ జెండాను మాత్రమే అమలు చేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాడని అందులో ప్రధానంగా మైనారిటీలపై దాడులు దళితులపై దాడులు కొనసాగిస్తూ కార్మిక హక్కులు కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేస్తూ తన నిజ స్వరూపాన్ని నిరూపించుకుంటున్నారని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడానికి ఓ పక్క చంద్రబాబు కాదంటూనే మరోపక్క వాళ్ళ ఎంపీ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం కనుక కేంద్ర ప్రభుత్వం ఏమి చేస్తే దానికి అనుకూలంగా ఉండాల్సిందేనని అన్నారు. ఈ విషయంపై చంద్రబాబు మోడీని నిలదీసే పరిస్థితిలో లేడని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పాలసీ మొత్తం వట్టి అబద్ధాలేనని ఒకటో రెండో పథకాలు అమలు చేస్తూ నేను అన్ని చేస్తున్నాను అని గొప్పలు చెప్పుకుంటున్నాడని అన్నారు. గత ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చేది కానీ నేడు రైతులకు ఎలాంటి భరోసా లేకుండా పోతున్నదని అన్నారు. ఎన్నికలకు ముందు బాదుడే బాదుడు అన్న చంద్రబాబు ఇప్పుడు ట్రూ అఫ్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపుతున్నాడని మండిపడ్డారు. గతంలో జరిగిన కాశ్మీర్ హర్యానా ఎన్నికల్లో కాదని హర్యానాలో గెలవడం విశ్లేషకులు అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. ఇండియా కూటమి గెలుస్తుందని అందరూ అనుకున్న హర్యానాలో ఎన్డీఏ కొట్టిన గెలిచింది ఎలా గెలిచిందో ఎవరికి తోచిన తీరుగా వారు చెప్పుకోవడం మనకు కనిపించింది అన్నారు. రానున్న మరో రెండు రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఎన్నికలు బిజెపి ప్రభుత్వానికి చాలా ప్రధానమని అక్కడ ఓడిపోతే మోడీ పరిస్థితి తారుమారవుతుందని సూచించారు.

## మహిళలకు ఉచితంగా ఆర్య వర్క్ ఫాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ

**విశాలాంధ్ర - చంద్రగిరి:** యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో నవంబర్ 15వ తేదీ (శుక్రవారం) నుండి 30 రోజుల పాటు పూర్తి ఉచితంగా ఆర్య వర్క్, ఫాబ్రిక్ పెయింటింగ్ పై మహిళలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభి స్తున్నట్టు సంస్థ డైరెక్టర్ పి. సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన చిత్తూరు, తిరుపతి జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 స.నుండి 45 సం. ల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు ఆర్య వర్క్ మరియు ఫాబ్రిక్ పెయింటింగ్ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. కనీస విద్యాహర్హత 8 వ తరగతి చదివి ఉండాలని శిక్షణ సమ యంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం కల్పిచబడి, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వబడు తుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికీ ధృవీకరణ పత్రాలు కూడా ఇస్తామని అధికారులు పేర్కొన్నారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలు,4 పాసుపోర్టు సైజు ఫోటోలతో సంస్థకి వచ్చి వారిపేరు నమోదు చేయిం చుకోవల సిందిగా కోరారు. మరిన్ని వివరాల కోసం ఈ క్రింది చిరునామా మరియు ఫోన్ నెంబర్లను సంప్రదిచాలన్నారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి,తిరుపతి జిల్లా, ఫోన్: 7989680587, 9494951289, 6301717672.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగే

## హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయండి

**విశాలాంధ్ర - చంద్రగిరి:** జనవరి 5, 2025 నాడు విజయవాడలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరుగ నున్న భారీ హిందూ బహిరంగసభను జయప్రదం చేయాలని చంద్రగిరి ఖండ కేంద్రంగా ఆదివారం సన్నాహక సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగళ్ళు, యర్రవారిపాలెం మండల విహెచ్‌పి కార్యకర్తలు, ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు మరియు సంఘ పరివార్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మాట్లాడుతూ హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగిం చేలాగా దేవాలయ నిర్వహణ లో చేయాల్సిన సంస్కరణలు సూచించారు. అదే విధంగా ఈ సంస్కరణలతో పొందు పరిచిన కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ కరపత్రం ప్రతి హిందూ కుటుంబానికి చెరేలా పెద్దలుసూచించారు. ఈకార్యక్రమంలో ఆర్ ఎస్ ఎస్ విభాగ్ అధికారి జగన్మోహన్ రెడ్డి, వి హెచ్ పి జిల్లా అధికారి కిరణ్ పాల్గొన్నారు.

## చౌడేపల్లి ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోగా చిన్న రెడ్డమ్మ

**విశాలాంధ్ర - చౌడేపల్లి :** చౌడేపల్లి మండల జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఒగా చిన్న రెడ్డమ్మ నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు స్థానిక ఐకెపి భవనంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు యాదవ్ గంగవరం మండలానికి బదిలీ కాగా పెద్దపంజాణి మండలంలో పనిచేస్తున్న చిన్న రెడ్డమ్మ ఇక్కడికి నియమి తులయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ఉపాధి హామీ పనులు లక్ష్యాన్ని పూర్తిచేస్తానని ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఏపీఓ తెలిపారు.

# పంచాయతీ అధికారుల తీరు మారదా...

### పారిశుద్ధ్యంపై పంచాయతీ పెద్దల అలసత్వం - రోగాల బారిన పడుతున్న పట్టణ ప్రజలు

**విశాలాంధ్ర-రేణిగుంట:** ప్రభుత్వాలు మారిన పంచాయితీ అధికారుల తీరు మాత్రం మారటం లేదు అనేందుకు రేణిగుంటలో ప్రస్తుతం జరుగుతున్న సన్నివేశాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మండల కేంద్రం, మేజర్ పంచాయితీలోనే పరిస్థితి ఈ విధంగా ఉందంటే మండలంలోని మిగతా పంచాయతీల పరిస్థితి ఏవిధంగా ఉందో అంటూ పట్టణంలో పలువురు చర్చించుకుంటున్నారు. రేణిగుంట అన్నదాన సత్రం వీధిలో సోమవారం డెంగు కేసు నమోదయింది. ఇందుకు గల కారణం పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే ఉండడం వలన దోమలు విపరీతంగా పెరగడంతో డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారిన పంచాయతీ అధికారుల తీరు మాత్రం మారడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కనీసం పట్టణంలో ఫాగింగ్ చేసిన సంఘటనలు లేవని ఇంతకీ గ్రామ పంచాయతీలో ఫాగింగ్ మిషన్ అందుబాటులో ఉన్నాయా అన్న సందేహాలు ప్రజలలో వెళ్ళువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు చొరవ చూపి రేణిగుంట పట్టణం పై పంచాయతీ అధికారులు అలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణి పై చర్యలు తీసుకొని వారానికి ఒకసారి ఫాగింగ్ చేయవలసిందిగా పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## నాటు సారా తయారీ స్థావరాలపై పోలీసుల దాడులు

**విశాలాంధ్ర - రామకుప్పం :** మండల పరిధిలోని అటవీ సమీప గ్రామమైన టేకుమాను తాండా సమీపంలోని అటవీ లోతట్టు ప్రాంతంలో నాటుసారా తయారీ కేంద్రాలపై రామకు ప్పం ఎస్ఐ వెంకటమొహన్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో వెళ్లి సుమారు వంద లీటర్ల నాటుసారా ధ్వంసం చేసి సారా తయారీకి ఉపయోగించే పరికరాలను అదేవిధంగా ముడి సరుకు నల్ల బెల్లం, చక్క తదితరుకును ధ్వంసం చేశారు ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు సమాచారం తో దాడులు నిర్వహించామని తెలిపారు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలేదిలేదని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నిషేధిత గంజాయి ,మాద క ద్రవ్యాలతో పాటు నాటుసారా తయారుచేసి విక్రయించే వారిని గుర్తించి కేసులు నమోదు చేసి న్యాయస్థానాల ఆదేశాల మేరకు కఠినంగా శిక్షించడం జరుగుతోందని హెచ్చరించారు కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ లేకపోవడంతో మండల వ్యాప్తంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు విచ్చల విడిగా జరుగుతోందని ఇప్పుడు ఎస్ ఐగా భాద్యతలు స్వీకరించిన వెంకట మొహన్ అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు అదేవిధంగా చట్ట వ్యతిరేక కార్యక లాపాలకు మాద క ద్రవ్యాలు మత్తు పదార్థాలు గంజాయి నాటు సారా మరియు కర్ణాటక మద్యం తదితర వాటిని విక్రయించేందుకు పాల్పడే వారి వివరాలు తమకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని సూచించారు కార్యక్రమంలో ఏఎస్ఐరెడ్డిప్రసాద్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పద భూమి పరిశీలన

**విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ :** మండల కేంద్రంలో కోర్టు వివాదంలో ఉన్న భూమిని తహసిల్దారు సుబ్రమణ్యం సోమవారం పరిశీలించారు. మండల కేంద్రంలో ఉన్న భూమి సర్వేనెంబర్ 249/2 లో సుమారు 2,30 సెంట్లు భూమిపై, ఆ స్థలంలో మండల విద్యాశాఖ కార్యాలయం, బీసీ హాస్టల్,తెలుగు గంగ సముదా యంలో ఉన్న భవనాలు, నిర్మించికొని కార్యకలాపాలు కొనసాగి స్తున్నారు. నీ స్థలంపై స్థానిక గ్రామస్తురాలైన గల్లా రత్నమ్మ సర్వ హక్కులు మాకు ఉన్నాయంటూ కోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై కోర్టులో వివాదంగా కేసు పూర్వపురాలు జరుగుతున్నాయి, రెవిన్యూ కార్యాలయముకు కోర్టు నోటీసులు రాగా ఆ ప్రకారం తాసిల్దార్ స్థలాన్ని పరిశీలించి నివేదికలు తయారుచేశారు, రెవెన్యూ అధికారులు సర్వేయర్ ద్వారా పరిశీలించి స్థల నమూనాను తయారు చేశారు, డిప్యూటీ తహసిల్దార్ చంద్రబాబు నాయుడు, మండల సర్వేయర్, సచివాలయం సర్వే స్థలాన్ని పరిశీలించారు.

## స్మశానానికి దారి కల్పించండి

**విశాలాంధ్ర-తొట్టంబేడు:** తొట్టంబేడు మండలం చోడవరంలో స్మశానానికి దారి కల్పించాలని టీడీపీ బీసీ సెల్ తొట్టంబేడు మండల అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం గ్రామస్తులతో కలసి తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చోడవరంలో స్మశానానికి చాలా కాలంగా నాలుగు అడుగుల మేర దారి ఉండేదన్నారు. అయితే కాలక్రమేణా కొందరు ఆ దారిని ఆక్రమించుకుని పొలాల్లో కలిపేసుకున్నార న్నారు. ఫలితంగా గ్రామంలో ఎవరైనా మరణిస్తే దహనక్రియల నిర్వహణ కోసం స్మశానానికి వెళ్లాలంటే నరకం కనపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆక్రమలు తొలగించాలని ఆయన కోరారు.

## విజయవంతంగా కబడ్డీ టోర్నమెంట్

**విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ :-** సత్యవేడు నియోజకవర్గ స్థాయిలో వాలీబాల్ మరియు కబడ్డీ టోర్నమెంట్ సోమవారం మండల కేంద్రంలోని హేరా మైదానంలో ఎన్.ఐ.సి కోచ్ బి జనార్దన్ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మావిళ్ళపల్లి సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు, ఈ టోర్నమెంట్ కి నియోజకవర్గ నలుమూలల నుంచి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు, ఈ టోర్నమెంట్ 'వి ' స్పోర్ట్స్ క్లబ్ వారు నిర్వహించారు కబడ్డీ పోటీలలో అండర్ 14 బాలికలు,16 టీములు పాల్గొన్నాయి,మరియు వాలీబాల్ అండర్ 17 బాలురు 16 టీములు, కబడ్డి అండర్ 17 బాల బాలికలు 18 టీంలు పాల్గొన్నారు,ఈ పోటీలలో వ్యాయామ ఫిజికల్ డైరెక్టర్లు కిషోర్, మస్తా న్, వరదయ్యపాలెం మండలానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## విద్యారంగంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారము జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి మాట్లాడుతూ, స్వాతంత్ర అనంతరము మొదటి విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ విద్యారంగంలో విశేష కృషి చేశారని, అందుకు గుర్తింపుగా 2008 సంవత్సరము నుండి ఆయన పుట్టినరోజును నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవం జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వము నిర్ణయించిందని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ దేశంలో 14 సంవత్సరాలు వయసు వరకు నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేయాలని గట్టిగా కృషి చేశారు. దేశ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు రావడానికి, ఐఐటీలు, బెనారస్ హిందూ యూనివర్సిటీ మొదలగునవి ప్రారంభం కావడానికి డాక్టర్ అబుల్ కలామ్ ఆజాద్ ఎనలేని కృషి చేశారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు, జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

## యస్.జయకుమారికి అభినందనలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల రెండవ రాష్ట్ర మహాసభలు ఏలూరులో జరిగిన సందర్భంగా రెండవసారి రాష్ట్ర అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికైన, ఎస్ జయకుమారికి చిత్తూరు నగర కమిటీ సమితి అభినందించింది. చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల ఆయమ్మల వర్కర్స్ యూనియన్ స్థాపించి వారి సమస్యల పైన, వారి జీతభత్యాల పైన రాజీలేని పోరాటాలు నిర్వహించిన ఫలితంగా చిత్తూరు జిల్లాలో యూనియన్ బలోపేతం చేయడానికి కృషి చేసిన ఫలితంగా, చిత్తూరు జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఏఐటియుసి రాష్ట్ర నాయకత్వం ఆమె పని విధానాన్ని గుర్తించి, ఏపీ ప్రభుత్వ పాఠశాలల ఆయమ్మల వర్కర్స్ యూనియన్‌కు, రాష్ట్ర అధ్యక్షురాలుగా యస్.జయకుమారిని ఎన్నుకోవడానికి ఏఐటియుసి నగర సమితి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపింది. చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆ యమ్మల వారి సమస్యల పైన, రాజీ లేని పోరాటాలు నిర్వహించడానికి మరింత కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ చిత్తూర్ కె.రమాదేవి పలువురు పాల్గొన్నారు.

## మా చెరువుకు తెలుగు గంగ నీరు విడుదల చేయండి

విశాలాంధ్ర-ఓజిలి: మండలంలోని రాచపాలెం, పినపర్య పాడు తదితర గ్రామ చెరువులకు తెలుగు గంగ నీరు విడుదల చేయాలని ఆయా గ్రామస్తులు సోమవారం తెలియజేశారు. మా గ్రామంలో ఎక్కువ శాతం మంది గొర్రెలు, గేదెలు, మేకలు పెంచుతున్నా మన్నారు. మేతకు వెళితే వాటికి త్రాగునీరు లేక అవస్థలు పడుతున్నామని సంబంధిత అధికారులు స్పందించి మా చెరువులకు నీరు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

# పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్

విశాలాంధ్ర-వెంకటగిరి: వన సంరక్షణ సమితి సభ్యులకు షేర్ అమౌంట్ పంపిణీ చేయాలని కోరుతూ తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభ్యులకు షేర్ అమెంటు మంజూరు చేయుట గురించి వెంకటగిరి రెంజర్ పరిధిలో 70 వన సంరక్షన సమితిలు ఉన్నాయి. వాటిలో జమ ఆయిల్ ప్లాంటిషను వేసి పెంచడం జరుగుతుందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వెంకటగిరి రేంజ్ పరిధిలో 130 ప్లాంటిషన్లు బ్యాంకు కటింగ్ జరిగినది. వాటి ద్వారా సుమారు 10 కోట్లు రూపాయలు ఆదాయం రావటం జరిగినదన్నారు. వచ్చిన ఆదాయం నుండి 50 శాతం సభ్యులకి పంపిణీ చేయవసియున్నదన్నారు. అకౌంట్ డబ్బులు జమ జమ చేయడం జరిగియున్నదని, అకౌంట్ నుండి 50 శాతం డబ్బు సభ్యులుకు ఇవ్వవలసిందిగా వెంకటగిరి మండల తహసీల్దార్‌ని కలిసి వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో మెమరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వన సంరక్షణ జిల్లా సంఘం కార్యదర్శి పి.బాలకృష్ణ జిల్లా అధ్యక్షులు భాస్కర్, చైర్ పర్సన్స్ చిరంజీవి, విష్ణు, జై కృష్ణ, అంకయ్య, రమణయ్య, మనీ, ప్రసన్న, రామయ్య, బాలకృష్ణ, సిపిఐ వెంకటగిరి నియోజకవర్గ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

విశాలాంధ్ర-పుత్తూరు: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపుమేరకు పుత్తూరు తహసీల్దారు కౌలు రైతులకు 20 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు గోవింద్ స్వామి కౌలు రైతుల సంఘం పుత్తూరు మండల నాయకులు డి.మహేష్ మాట్లాడుతూ గాలేరి నగిరి ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని కోరారు. వేణుగోపాలపురం సాగర్ ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు. పుత్తూరు మార్కెట్ యార్డులో రైతులకు షెడ్యూల్ ఏర్పాటు చేయాలని రైతులకు రవాణా చేయడానికి అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలని తెలిపారు. 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు 20 వేల రూపాయలు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించారు. అయినా ఇప్పటికీ అమలు చేయలేదు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం గత ఐదు సంవత్సరాలుగా ఆటకెక్కిందని ఆ దశలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరుకు మీరు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అలాగే వెనుకబడిన ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికి చేయాలని తెలిపారు. 32 మంది విద్యార్థుల ప్రాణ త్యాగాలు ప్రజాప్రతినిధులు రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ప్లాంట్ని ప్రైవేటుపరం కాకుండా విలువలు విచ్చేసినందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో రైతంగం సాగు చేసుకున్న పంటలన్నిటికీ రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా సొమ్ము ప్రభుత్వం భరించి రైతన్నను ఆదుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గోవింద్ స్వామి రెడ్డి, కౌలు రైతు సంఘం డి.మహేష్ నాయకులు భాస్కర్, కృష్ణారెడ్డి, కాశి తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం అన్నదాతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సిపీఐ నేతలు డిమాండు చేశారు. ఈ మేరకు వారు సోమవారం శ్రీకాళహస్తి తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సహాయం రూ.20వేలు అందిస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణం అన్నారు. గత ప్రభుత్వ విధానాల వలన రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై సుమారు రూ.2.45 లక్షల రుణ భారం పడిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జరమాల గురవయ్య, మించల శివకుమార్, శ్రీనివాసులు, మణి, నాగరాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులు

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వివిధ క్రీడలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే. సులోచన పేర్కొన్నారు గతవారం బంగారుపాళ్యం మండలం ఇ.ఆర్ పెంట ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్ 17 జిల్లా స్థాయి బాల, బాలికల సాఫ్ట్ బాల్ పోటీలలో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వి.జి. మాఘలక్ష్మి, కె.చారు, 9వ తరగతి చదువుతున్న ఎన్.ముని జీవన్, యం.యస్.నవీన్ కుమార్, ఎన్.కృష్ణకిషోర్, కె.గోపిక, తిరుపతి లోని మంగళం ట్రెండ్స్ హై స్కూల్‌లో నిర్వహించిన బేస్ బాల్ క్రీడలో 8వ తరగతి చదువుతున్న ఎస్.బాలాజీ, పి.రిషి ఎంపికయ్యారు వీరు ఈ నెల 23 నుండి అండర్ 17- సాఫ్ట్ బాల్ బాలురు అనంతపురంలో, 28 నుండి బాలికలు కాకినాడ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. అండర్ 14 క్రీడాకారులు ఈ నెల 16 నుండి చిత్తూరు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు, బేస్ బాల్ క్రీడాకారులు ఈ నెల 24 నుండి తిరుపతి లోని మంగళం ట్రెండ్స్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ అధ్యాపకులు ఏ.జయప్రకాష్ తెలిపారు. జిల్లా స్థాయిలో మంచి ప్రతిభను చూపి రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని వీరు రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా మంచి ప్రతిభను కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయులు సులోచన పేర్కొన్నారు. వీరి ఎంపిక పట్ల వ్యాయామ ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సదాశివం, వర్మ, మునివేలు, లక్ష్మీప్రసాద్, ధనలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

## మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన విద్యా కమిటీ చైర్‌పర్సన్ టి.ఆర్.దీప

విశాలాంధ్ర-గుడిపాల: మండలంలోని నరహరి పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం విద్యా కమిటీ చైర్‌పర్సన్ టి.ఆర్.ఢిల్లీ బాయ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకే ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని ఢిల్లీ బాయ్ తెలిపారు. ఢిల్లీ భాయ్ తనిఖీల్లో విద్యార్థులకు మంచి భోజనం అందుతున్నాయని తెలిపారు. అదేవిధంగా పాఠశాలలో మరుగు దొడ్లు పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కాతుంబి, వైస్ చైర్ పర్సన్ సతీష్, కమిటీ మెంబర్లు ప్రియా దేవి, వసంత, రాజ్ కుమార్, నాగరాజ్, ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముక్కంటికి ఆరు నైవేద్య పాత్రలు వితరణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామికి చెన్నైకు చెందిన బి.శ్రీనివాస్ అనే భక్తుడు సోమవారం రూ.92,332 విలువ చేసే ఆరు నైవేద్య పాత్రలను వితరణ చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎన్ఆర్ కృష్ణారెడ్డి ఈ పాత్రలు స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలియచేసి దర్శన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

**జూమ్ మీటింగ్‌లో డి.జి.పి**

**విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కే రమణయ్య ఆధ్వర్యంలో సోమవారం సైబర్ క్రైమ్ నేరాలపై డిజిపి. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెల్ ఫోన్ వినియోగం గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆధునిక టెక్నాలజీ కాలంలో సెల్ ఫోన్ వినియోగం పెరిగిపోయిందని అన్నారు. ప్రతినిమిషం సెల్ ఫోన్ లేనిదే ఏ పని చేయలేకపోతున్నామని, ప్రతీదీ కూడా సెల్ ఫోన్ తోనే ముడిపడిఉండడంతో మన సెల్ ఫోన్ నెంబర్ కూడా మన బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, పెన్షన్, పౌరసరఫరాల వినియోగానికి సంబంధించి అన్ని విధాలుగా మన సెల్ ఫోన్ నెంబర్ అవసరం ఉంటుందని అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు ఏదో లేనిపోని ఆశలు చూపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరాల పట్ల, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలు డ్రగ్స్ వంటి తదితర అంశాల పై యువత, విద్యార్థునులకు పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో మహిళలు పిల్లలను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. యువత ఇంటర్నెట్ పరిమితికి మించి వాడకూడదని, సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులను కాజేస్తున్నారని విద్యార్థులకు తెలియపరిచారు,గుర్తు తెలియని వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీ ఏటీఎం, పిన్‌నెంబర్, సీవీవీ, బ్యాంకు ఖాతా తదితర వివరాలు కోరితే ఇవ్వరాదన్నారు. ఎవరైనా మీకు లాటరీ తగిలింది, కొంత డబ్బును సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేయాలని ఫోన్ కాల్ వచ్చినా, ఏ విధంగా అయినా మీరు మీ బ్యాంకు ఖాతా నుండి డబ్బును కోల్పోతే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి ఆపద సమయంలో సైబర్ నేరాల పట్ల టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి లేదా 100 లకు ఫోన్ చేసి పోలీసులకు, ఇతర శాఖల యంత్రాంగం సేవలు పొందాలని ఆయన కోరారు. విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తును తీర్చిదిద్దు కొనాలని, ఉన్నత ఉద్యోగాలు సాధించాలని మహిళలపై చిన్న పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని ఉద్దేశంతోనే ఈ అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సై విశ్వనాథ నాయుడు, పోలీసు బృందం పాల్గొన్నారు.

## అబుల్ కలాం ఆజాద్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే బొజ్జల

**విశాలాంధ్ర-శ్రీకాళహస్తి:** భారత స్వతంత్ర సమరయోధుడు అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. భారత స్వతంత్ర సమరయోధుడు అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాళులర్పించిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొని అబ్దుల్ కలాం అజాద్‌కు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

## తెల్ల క్వార్ట్జ్ రాయి తరలించే ట్రిప్పర్ పట్టివేత

**విశాలాంధ్ర-తడ:** తిరుపతి జిల్లా గూడూరు నుండి చెన్నై కు అక్రమంగా క్వార్ట్జ్ తెల్ల రాయి తరలించే టిప్పర్లు సోమవారం తెల్లవారుజామున తడ పోలీసులు పట్టుకున్నారు. సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు పర్యవేక్షణలో తడ భీమునివారి పాలెం తనిఖీ కేంద్రం వద్ద సిఐ మురళీకృష్ణ తడ ఎస్ఐ కొండప్ప నాయుడు మరియు పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా గూడూరు నుండి చెన్నైకు ఏపీ 04యుబీ 0663 ట్రిప్పర్ లోఅక్రమంగా తెల్లరాయిని తరలిస్తున్నట్టు గుర్తించామని ఆ వాహనం డ్రైవర్ తో పాటు వాహన యజమానులు కూడా అదుపులో తీసుకున్నట్లు సిఐ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక ,క్వార్ట్జ్ రాయి రవాణా చేస్తున్నట్లు తెలిస్తే వాట్సాప్ నంబర్ 8688478206 కు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతుందని తెలిపారు.

## కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

**విశాలాంధ్ర-పుత్తూరు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా 26న ఆందోళన కార్యక్రమాలు జరగనున్నది. అందులో భాగంగా సోమవారం ట్రేడ్ యూనియన్లు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నగరి మండల తహసిల్దార్ రవికుమార్ ద్వారా వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి నగరి నాయకులు వి.వేలన్, షబ్బీర్ భాషలు మాట్లాడుతూ 3వ సారి అధికారంలోకివచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం రైతులు, కార్మికులు, ప్రజల సమస్యల పట్లల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కోటీశ్వరులు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ సామాన్య, మధ్యతరగతి ప్రజలను రైతులను కార్మికులను సమస్యలను పట్టించుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు. రైతులు పట్ల కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రానున్న రోజుల్లో మోడీకి తగిన శాస్తి జరుగుతుందని దుయ్యబట్టారు. 2024 ఎన్నికల్లో సందర్భంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రైతుకు 20వేల రూపాయలు పెట్టుబడికి సహాయం అందించాలని, రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తికి అవసరమైన నిధులను జరిగే బడ్జెట్లో కేటాయించి సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 40 వేలకు పైగా చెరువులు ఉందని అందులో ఉత్తరాంధ్ర జిల్లాలో 21 వేలకు పైగా చెరువులు ఉన్నాయని చెరువులను సప్లై ఛానల్ ఆక్రమణకు గురి అయిందని అలాంటివి గుర్తించి మరమ్మతులకు చర్యలు చేపట్టాలి. 32 మంచి విద్యార్థులు ప్రాణ త్యాగాలు చేసి ప్రజాప్రతినిధులు కూడా తమ పదవులను కూడా త్యాగం చేసి రాజీనామా చేసి స్థాపించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రబీ సీజన్లో రైతాంగం సాగు చేస్తున్న పంటలన్నిటికి రాష్ట్ర ప్రభుత్వం మే పంటల బీమాను ప్రభుత్వమే భరించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. తహసిల్దార్ స్పందిస్తూ మీరిచ్చిన వినతి పత్రాన్ని ప్రభుత్వానికి పంపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి నగరి నాయకులు షబీర్ భాష, రాజేంద్రన్, ఇంద్ర, భాస్కర్ రెడ్డి, మునిరత్నం రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం, మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది

**జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ**

**విశాలాంధ్ర-చిత్తూరు:** రాష్ట్రంలోని ముస్లిం, మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ బీ.ఎన్ రాజసింహులు తెలిపారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో మాజీ విద్యాశాఖ మంత్రి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకొని మైనారిటీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి నియోజక వర్గం,మండలాల్లో షాది ఖానాలను నిర్మించిన ఘనతప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి, ఉర్దూ పాఠశాలల అభివృద్ధి, విద్యా వ్యవస్థలో సంస్కరణ కోసం మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంతో కృషి చేశారని కొనియాడారు.మాజీ మేయర్ కఠారి హేమలత మాట్లాడుతూ. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మంచి ప్రభుత్వం నడుస్తోందన్నారు. రానున్న రోజుల్లో ముస్లిం, మైనారిటీలకు మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీ సంక్షేమ శాఖలు, వక్ఫ్ బోర్డు, ఉర్దూ అకాడమీ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి చిన్న రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 815 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవ నాయుడు, నాయకులు సురేంద్ర కుమార్, ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులు,విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యా వ్యతిరేక విధానాల పైన పోరాటాలకు సిద్ధం కావాలి

**బి.ప్రవీణ్ కుమార్ ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్**

**విశాలాంధ్ర-పుత్తూరు:** అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ నగరి నియోజకవర్గం కమిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని, బ్రిటీష్ పాలకులను ఈ దేశం నుంచి తరిమి కొట్టాలని లక్ష్యంతో, స్వాతంత్ర సంగ్రామ పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలకు విజయనగరం వేదిక కానుందని తెలిపారు. విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కాషాయకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా కాషాయీకరణ చేసే పద్ధతులలో జాతీయ నూతన విద్యా విధానం వల్ల ఇప్పటికే రాష్ట్రంలో చాలా విద్యాసంస్థలు మూతబడటం కూడా జరిగిందని తక్షణమే జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు.చేయాలన్నారు.యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారు ఇచ్చినటువంటి హామీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం వల్ల చాలామంది విద్యార్థులు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలన్నారు. వైద్య విద్యను పేదలకు దూరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తున్న జీవో నెంబర్ 107, 108 రద్దు చేస్తామని ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం మాట నిలబెట్టుకొని జీవో నెంబర్ 107 108 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నగిరి నియోజకవర్గ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షా, కార్యదర్శులుగా పాండ్యన్, షారుఖ్, ఉపాధ్యక్షులుగా దిలీప్, లక్ష్మీ ప్రసాద్,జానకిరామ్ సహాయకార్యదర్శులుగా విఘ్నేష్, విష్ణుసాయి, విష్ణు కోశాధికారిగా జ్యోతిరాంలను కార్యవర్గ సభ్యులుగా ఆదిత్య, మహేష్, సాయికుమార్, నితిన్, చంద్ర, ప్రీత్వి లను గర్ల్స్ కన్వీనర్లు మేనక, ఉమ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## లారీ ఢీకొని యువకుడికి గాయాలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు రూరల్ పరిధిలోని చెమిర్తి గ్రామం వద్ద లారీ ఢీకొని యువకుడికి గాయాలు అయినా సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు చెమిర్తి గిరిజన కాలనీకి చెందిన మొలకల సురేష్ అనే యువకుడు తన ఇంటి వద్ద నుండి ద్విచక్ర వాహనంలో బయలుదేరి చెమిర్తి నుండి గూడూరుకి వెళ్ళే ప్రధాన రోడ్డు మార్గంలో వెళ్తుండగా అదే మార్గంలో వెంకటగిరి నుండి గూడూరు కి వెళ్తున్న లారీ ఢీ కొనింది. దీనితో యువకుడు రోడ్డు పక్కన ఉన్న ప్రాంతంలో పడిపోయాడు. దీనితో స్థానికులు హుట హుటిన 108 ద్వారా స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## వన్ టౌన్ సిఐని సన్మానించిన హరిబాబు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వన్ టౌన్ సిఐ గోపిని తెదేపా గాండ్ల, తెలికుల బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు ఘనంగా సన్మానించారు. సోమవారం పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ గోపిని గాండ్ల, తెలికుల బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరం హరిబాబు మర్యాదపూర్వకంగా కలిసి దుశాలువాతో సన్మానించి కలియుగ దైవ వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటమును అందించి గౌరవించారు. అనంతరం సీఐతో మాట్లాడుతూ మీరు చార్జ్ తీసుకున్న తర్వాత పట్టణంలో బహిరంగ ప్రదేశాలలో మద్యమును నిషేధించడం అదేవిధంగా గంజాయి తాగే యువకులను తగిన విధంగా వాళ్లకి చెడు మార్గాలు దూరంగా ఉండాలని కౌన్సిలింగ్ ఇవ్వడం, మద్యం సేవించి ఆటోలు, స్కూటర్లు తోలరాదని వారికి తగిన విధంగా జరిమానా విధించి కోర్టుకు హాజరు పరచడం ఇలా చాలా రకాలుగా మీ యొక్క కృషి బాగుందని స్నేహ పూర్వకంగా కలిసి మాట్లాడుకోవడం జరిగిందని పత్రికా ముఖంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నావరం ప్రకాష్, సుబ్రమణ్యం, ముని, గోపి, వాసు, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ప్రాంగణ భవన నిర్మాణ పనులు చేపట్టండి: బొజ్జల బృందమ్మ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హయాంలో పట్టణంలోని బత్తయ్య నాయుడు హాస్పిటల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలం 1.90 ఎకరాల స్థలంలో మహిళా ప్రాంగణము నిర్మించాలని ప్రతిపాదనలు చేసిన స్థలంలో మహిళ ప్రాంగణ భవన నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని బత్తయ్య నాయుడు హాస్పిటల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వస్థలం గత టిడిపి ప్రభుత్వ హాయంలో 1.90 ఎకరాల స్థలంలో మహిళా ప్రాంగణము నిర్మించాలని మాజీ మంత్రివర్యులు కీర్తిశేషులు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ప్రతిపాదనలు చేసి పంపారని, కానీ వైసీపీ ప్రభుత్వంలో ఆ స్థలం అంతా కబ్జాలకు గురి అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని తక్షణమే మహిళా ప్రాంగణ భవనాన్ని నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని బొజ్జల బృందమ్మ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సోమవారం బొజ్జల బృందమ్మ టిడిపి నాయకులతో కలిసి ఆ స్థలాన్ని పరిశీలించారు. అధికారులు వెంటనే 1.90 ఎకరాల స్థలంలో మహిళ ప్రాంగణ భవన నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

# విలువలు విశ్వసనీయతకు నిదర్శనమే బొజ్జల కుటుంబం

- గంగమ్మ కమిటీలకు కొన్నింటికి 20 ఏళ్లుగా లెక్కలు లేవు
- వసూళ్లు చేసి మింగేసే సంస్కృతి వైకాపా వారిదే
- మాజీ ఎమ్మెల్యే విమర్శలపై టీడీపీ నాయకుల స్పందన

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: విలువలు, విశ్వసనీయతకు నిదర్శనం బొజ్జల కుటుంబమని 30 ఏళ్ల రాజకీయ జీవితం నుంచి ఇప్పటి వరకు ఆ చిన్నపాటి మచ్చ లేకుండా రాజకీయ జీవితంలో ఉన్న కుటుంబం బొజ్జల కుటుంబమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సోమవారం తన కార్యాయలంలో ఎమ్మెల్యేపై గంగమ్మ కమిటీకి సంబంధించి చేసిన విమర్శలపై టీడీపీ స్థానిక నూతన ప్రెస్‌క్లబ్‌లో ఆ పార్టీ నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ జాతర కమిటీలను బలవంతంగా తప్పిస్తున్నారని వారి వద్ద ఉన్న పుస్తకాలను లాక్కొన్నారంటూ అసత్య ఆరోపణలు చేశారని ఈ సందర్భంగా మండిపడ్డారు. ఎమ్మెల్యే నాలుగు రోజులుగా విజయవాడలో ఉన్నారని ఈ రోజు సైతం అసెంబ్లీలో ఉన్నారని గుర్తు చేశారు. ఇన్ని సంవత్సరాల్లో కమిటీల్లో ఎవరెవరున్నారో అందరికి తెలుసునని ఎంతెంత వసూలు చేసి మింగేసి జాతర తర్వాత ఎక్కడెక్కడకు టూర్లు తిరిగింది అందరికి తెలుసునన్నారు. ఇన్నేళ్ల కాలంలో జాతర డబ్బులు ఎంతెంత వసూలు చేశారో కనీసం లెక్కలు కూడా చెప్పకుండా బరితెగించి వ్యవహరించారని మండిపడ్డారు. అయినప్పటికీ అందరిన్నీ కలుపుకుని పోయి జాతర నిర్వహించాలనే చెబుతారే కానీ తమరి లా వసూళ్లు చేసి, దౌర్జన్యాలు, దందాలు చేసి తినండి అని చెప్పే సంస్కృతి బొజ్జల కుటుంబానికి లేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కమిటీల్లో తమ వారే ఉండాలని మిగిలిన వారు ఉండకూడదనే ఆలోచన వారి కుటుంబానికి ఎప్పుడూ లేదని ఇలాంటి విషయాల్లో అనవసర నిందలు మోపడం మంచి పద్ధతి కాదన్నారు. జాతర ఇంకా ఎంతో సమయం ఉందని ఇంత వరకు కమిటీలే వేయలేదని, ఏ నిర్ణయాలు తీసుకోలేదని ఇంతలోనే దౌర్జన్యాలు చేస్తూ వసూళ్లు చేస్తున్నారని విమర్శలు చేయడం సరికాదని ఇలాంటివి ఉంటే బహిరంగంగా నిరూపించాలని సవాళు విసిరారు. తమ నాయకులు అసలు గంగమ్మ జాతరలో అసలు వసూళ్లు అనే విధానం లేకుండా పార్టీలకు ఎలాంటి సంబంధమే లేకుండా శ్రీకాళహస్తీశ్వరాలయమే నిర్వహించేలా ప్రయత్నాలు చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ఐదేళ్లలో శ్రీకాళహస్తి పట్టణంలో ఏమేమీ జరిగాయో ప్రజలందరికి తెలుసునని చెప్పారు. రాబోయే ఐదేళ్ల ఉత్సవాలు ఎంత పద్ధతిగా నిర్వహిస్తామో ప్రజలందరూ చూస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎవరో ఏదో చెప్పారని వచ్చి అసంబద్ధ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఉన్న కమిటీల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా తెలుగుదేశం వాళ్లు లేరని అందరం కలిసి చేసుకోవాలే కానీ తాము లెక్కలు చూపం. ఎవర్ని రానీయం అంటే ఎలాగని ఈ సందర్భంగా ప్రశ్నించారు. అనవసరంగా ఎమ్మెల్యేపై అబండాలు వేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. జాతర మహోత్సవం కలిసి నిర్వహిస్తామని కలిసి వచ్చి అందరితో నడవాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ విషయంలో ఎమ్మెల్యేను అనవసరంగా లాగవద్దన్నారు. మద్యం దుకాణాల్లో సిండికేట్ అయ్యారంటూ ఆధారాలు లేకుండా మాట్లాడం మంచిపద్ధతి కాదన్నారు. గంగమ్మను కూడా సిండికేట్ చేస్తామని మాట్లాడుతున్నారని అలాంటి సంస్కృతి తమ పార్టీ వారికే ఉందన్నారు. మద్యం దుకాణాల్లో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన విధానమే ఇక్కడ కూడా జరిగిందన్నారు. 32 దుకాణాలకు గాను 356 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎంతో పద్ధతిగా లాటరీ విధానం జరిగిందన్నారు. వైకాపాతో పాటు అన్ని పార్టీలకు చెందిన వారు కూడా ఇందులో పాల్గొన్నారన్నారు. బయటకు చెందిన వ్యక్తులకు కూడా ఇక్కడ దుకాణాలు వచ్చాయన్నారు. ఒక్క రూపాయి అధికంగా విక్రయించినా కేసులు నమోదు చేయాలంటూ సాక్షాత్తూ సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఐదేళ్లలో కల్తీ మద్యం విక్రయించి ఎంత మంది జీవితాలను అంధకారం చేశారో ప్రజలందరికి తెలుసునన్నారు. టీడీపీ నాయకుడు కాసరం రమేష్ మాట్లాడుతూ యువత కొత్తదనం కోరుకుంటుందని జాతర మహోత్సవంలో తాము భాగస్వామ్యమై కార్యక్రమాన్ని ముందుకు నడిపేందుకు వచ్చే వారిని స్వాగతించాలే కానీ విమర్శలు చేయడం సరికాదన్నారు. గత మాజీ చైర్మన్ గంగమ్మ ఆలయ కుంభాషేకానికి పదుల సంఖ్యలో నాయకులను వేసుకుని వెళ్లి హీరోయిజం చూపించడం ఎంత వరకు సమంజసమన్నారు. పెండ్లిమండపం గంగమ్మ కమిటీకి బంగారు, వెండి నగలున్నాయని వీటిని ఇప్పటి వరకు ప్రజలకు చూపించిన దాఖలాలు లేవన్నారు. లాకర్‌లో ఉండాల్సినవి నాయకుల ఇళ్లలో ఉంటున్నాయని ఇది ఎవరి సొమ్ము అని ఈ సందర్భంగా ప్రశ్నించారు. లక్షలు వసూలు చేసి జాతర తర్వాత టూర్లు, షికార్లు చేస్తున్నారని ఇది పెద్ద కుంభకోణమన్నారు. దీనిపై న్యాయ విచారణ జరగాలన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మిన్నలి రవి మాట్లాడుతూ గంగమ్మ ఉత్సవ నిర్వహణ విషయంలో ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేకపోయినా విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎస్సీ కమిటీ నాయకుడు మాట్లాడుతూ సుబ్బయ్య మాట్లాడుతూ ఐదేళ్లలో ఎస్సీలపై ఎన్నో అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేసిన ఘనత మధుసూదన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గుడిని గుడిలో లింగాన్నే మింగేసిన వ్యక్తి మధుసూదన్‌రెడ్డి అని ఈ సందర్భంగా మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షాకిర్ అలీ మినరల్ రవి లక్కమనేని మధుబాబు నాగమల్లి దుర్గాప్రసాద్ సుప్రజ గోపీనాథ్ కాసారం రమేష్ వజ్రం కిషోర్ గుర్రప్ప శెట్టి ఉమేష్ నెమల్లూరు బుజ్జి సుబ్బయ్య కిట్టు ఢిల్లీ బాబు వినయ్ హేమంత్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐని మర్యాద పూర్వకంగా కలిసిన టిడిపి, జేసీస్పీ నేతలు

విశాలాంధ్ర-రామకుప్పం: నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకట మోహన్‌ను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనంద రెడ్డి మరియు జనసేన పార్టీ అధ్యక్షుడు హరీష్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట మోహన్‌కు పూలమాలలు వేసి దుశ్శాలువలవతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని, ముఖ్యంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, పవన్, సతీష్, మంజునాథ్, బాలాజీ, భాస్కర్, గంగాధరం, అంజి, మహేష్, గజేంద్ర, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే భూముల వివరాలు పునఃపరిశీలన

విశాలాంధ్ర-బాలాయపల్లి: మండల పరిధిలోని వివిధ రెవెన్యూ గ్రామాలలో గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీ సర్వే భూముల వివరాలను పునఃపరిశీలన చేయాలని తహసీల్దార్ పూజారి శ్రీనివాసులు వీఆర్‌ఓలకు సూచించారు. సోమవారం స్థానిక బాలాయపల్లి తహసీల్దార్ కార్యాలయం లో ఆయన వీఆర్‌ఓలతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ రీ సర్వే భూములకు సంబంధించి సరైన వివరాలు నమోదు చేయాలని అన్నారు. రీసర్వే భూములపై వచ్చే ఫిర్యాదుల వివరాలను సరిగా నమోదు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శిరీష, ఆర్ఐ శ్రీకాంత్ వీఆర్‌వోలు శ్రీనివాసులు రెడ్డి, ఈశ్వర్ రాజు, గోపిరెడ్డి ఆదిశేషయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చల్లంపల్లి ప్రాజెక్టు గేటుని సొంత నిధులతో మరమ్మతు చేసుకున్న రైతులు

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: యర్రావారిపాళ్యం మండలం యల్లమంద గ్రామం రైతులు అందరూ కలిసికట్టుగా చల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా నీటిని సరఫరా చేయు డోర్ ను మరమ్మతు చేసి డోర్‌కు పైపును అమర్చి స్టీరింగును కూడా ఏర్పాటు చేయడం జరిగినది. ఈ పనికి అయిన మొత్తం ఖర్చులు రైతులే చందాల ద్వారా వసూలు చేసి ప్రాజెక్టు డోర్‌ని మరమ్మతు చేసుకోవడం జరిగింది.

# రైతు వ్యతిరేక విధానాలపై 26న ఆందోళన

విశాలాంధ్ర-చిత్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా 26న ఆందోళన కార్యక్రమాలు జరగనున్నది. అందులో భాగంగా సోమవారం రైతు సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుచిత్తూరు మండల తహసిల్దార్ ద్వారా వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి కాంజీవరం సురేంద్రన్‌లు మాట్లాడుతూ అధికారంలోకివచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం రైతులు, కార్మికులు, ప్రజల సమస్యల పట్లల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, కోటీశ్వరులు, కార్పొరేట్ శక్తులకు ఆదాని, అంబానీలకు ఊడిగం చేస్తూ సామాన్య, మధ్యతరగతి ప్రజలను రైతులను కార్మికులను సమస్యలను పట్టించుకోవడం లేదని తీవ్రంగా విమర్శించారు రైతులు పట్ల, కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రానున్న రోజుల్లో మోడీకి తగిన శాస్తి జరుగుతుందని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో సందర్భంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రైతుకు 20వేల రూపాయలు పెట్టుబడికి సహాయం అందించాలని, రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తికి అవసరమైన నిధులను జరిగే బడ్జెట్లో కేటాయించి సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు తాసిల్దార్ స్పందిస్తూ వినతి పత్రాన్ని ప్రభుత్వానికి పంపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ చిత్తూరు నగర కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కే.రమాదేవి, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు వి. దామోదరం, పి.రఘు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి కే.విజయ గౌరీ, జమీలబి, చిత్తూరు నగర అధ్యక్షులు బి.కుమారి, ఏ.కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర-తడ: మండల పరిధిలోని కారూరు పంచాయితీ కాసింగాడు కుప్పం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రఘురామయ్య మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో సృజనాత్మక సామర్థ్యాలను పెంపొందించాలంటే విద్య ఒక్కటే మార్గమని అన్నారు. మౌలానా సేవల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించగా ఏడవ తరగతి విద్యార్థిని కుమారి శ్రీమతి మొదటి బహుమతిని పొందింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరీముల్లా, సుధాకర్, తిరుపతి, సుబ్రహ్మణ్యం, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

విశాలాంధ్ర-నాయుడుపేట: నాయుడుపేట పట్టణంసమీపంలో సోమవారం స్వర్ణముఖి నది నందు సుమారు 35 నుండి 40 సంవత్సరాల గుర్తు తెలియని మగ శవము గుర్తించినట్లు నాయుడుపేట పోలీసులు తెలిపారు.సదరు శవము వివరాలు తెలిసినచో నాయుడుపేట పోలీసు స్టేషను నందు తెలపవలసినాయుడుపేట స్వర్ణముఖి నది నందు సుమారు 35 నుండి 40 సంవత్సరాల గుర్తు తెలియని మగ శవము గుర్తించమైనది. సదరు శవము వివరాలు తెలిసినచో నాయుడుపేట పోలీసు స్టేషను నందు తెలుపగలరు.

## పూర్వ విద్యార్థులు వితరణ

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటి నగరం 1988-89 ఎస్ఎస్సి బ్యాచ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ తరపున కార్వేటి నగరంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు దాదాపుగా 3 లక్షల 30 వేల రూపాయలతో సభ భవనం నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి ఎం విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ 1988-89 పదవ తరగతిలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సభ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. అలాంటి విద్యార్థులకు దేవుడు కృపఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం గాయత్రి దేవి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం విజయ కుమార్ పిళ్లే, ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## యూత్ ఫెస్టివల్‌లో విజయం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-చిత్తూరు: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఇంటర్ కాలేజీయేట్ యూత్ ఫెస్టివల్ విజయం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తం ప్రతిభను కనబరిచారు. మూడు రోజులపాటు జరిగిన ఈ యూత్ ఫెస్టివల్‌లో విజయం కాలేజీ చెందిన జీవన్, వెంకటేష్ సంధ్య అన్సారీ, జోషిక, బన్నీ, గోమతి, విగ్నేష్, మోహన్, విజయ అనే విద్యార్థులు వివిధ రంగాల్లో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత తే జోమూర్తి అకాడమిక్ డైరెక్టర్ శైలజ మూర్తి బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగివుండాలి

విశాలాంధ్ర-గూడూరు: విద్యార్థులు సైబర్ నేరాలకు మోసపోకుండా వీటిపై అవగాహన కలిగివుండాలని రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సెయింట్ మేరీస్, బాలాజీ, స్వర్ణాంధ్రభారతి, ఎన్ కేఆర్ ప్రభుత్వజూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో కొందరు సైబర్ నేరగాళ్లు ఆన్లైన్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. మన వివరాలను కానీ బ్యాంక్, ఖాతా నంబర్లు కానీ తెలియనివారికి ఇవ్వకూడదన్నారు. ర్యాగింగ్ కు పాల్పడడం, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు గోపాల్, సుబ్రమణ్యంరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒరిగిన స్తంభాన్ని లేపాలి

విశాలాంధ్ర-ఓజిలి: మండలంలోని పినపర్యపాడు గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభ ఒరిగిపోయి ఉందని దాని వలన ప్రమాదాలు జరగవచ్చునని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని లేపాలని పినపర్యపాడు గ్రామస్తులు సోమవారం తెలియజేశారు.

## సమస్యల కుప్పగా గిరిజన హాస్టల్

**జనసేన పార్టీ ఇన్‌చార్జి వినుత కోటా**

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దాదాపు 650 మంది బాలికలు ఉంటున గిరిజన హాస్టళ్లు, పరిసర ప్రాంతాలు సమస్యల కుప్పగా ఉందని జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత కోటా ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలికల హాస్టళ్లను సందర్శించారు. దాదాపు 650 మంది బాలికలు ఈ హాస్టల్ లో ఉంటున్నారని తెలిపారు. ఆడ బిడ్డల సమస్యలు వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యల కుప్పగా హాస్టల్, పరిసర ప్రాంతం ఉందని తెలిపారు. గత ప్రభుత్వం 5 సంవత్సరాలలో ఏ మాత్రం పట్టించుకోకుండా గాలికి వదిలేశారని తెలిపారు. డైనింగ్ హాల్ లో ఆహారం క్వాలిటీ పరిశీలించి. బాలికలతో కలిసి భోజనం చేశారు. నీటి సమస్య, త్రాగు నీటి సమస్య, డైనింగ్ హాల్ వర్షాకాలం లో రూఫ్ లీకేజి, హాస్టల్ వార్డెన్ దురుసుగా ప్రవర్తిస్తుందని, హాస్టల్ లో సరిపడా తగు లైట్లు లేవని, కాంపౌండ్ వాల్ సరిగా లేదు, బయట నుండి ఆకతాయిలు సాయంత్రాల్లో ఇబ్బందులు పడుతున్నారని, ఆహారం క్వాలిటీ గా పెట్టడం లేదని, 650 మందికి సరిపడా హాస్టల్ లేదని, 40 మందికి ఒక రూమ్ లో పడుకుంటున్నారని, బాత్ రూముకి సరిపడా లేవని, సి. సి. కెమెరాలు పని చెయ్యడం లేదని, సరిపడా ల్యాబ్ ఫెసిలిటీ లేదని, వాచ్ మెన్/ సెక్యూరిటీ లేదని, సరిపడా వార్డెన్ స్టాఫ్ లేరు. 650 మందికి ఒకే వార్డెన్ ఉందని, సానిటరీ ప్యాడ్ డిస్పోసల్ మిషన్ లేదని తదితర సమస్యలను వినుత కోటా దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి, జిల్లా కలెక్టర్ కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకుని వెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇక పై తరచూ హాస్టల్ కి వచ్చి ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని ధైర్యం చెప్పారు. స్కూల్, హాస్టల్ లో కంప్లైంట్ బాక్స్ పెడతామని సమస్యలు ఎప్పటి కప్పుడుతెలపాలని కోరారు. దురుసుగా ప్రవర్తిస్తున్న హాస్టల్ వార్డెన్ ను మందలించి మరోసారి కంప్లైంట్ వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు వితరణ

విశాలాంధ్ర-చిత్తూరు: మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పుష్కరించుకుని చిత్తూరు వైసీపీ ఇంచార్జ్ విజయా నంద రెడ్డి పేద విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నగరంలోని వివిధ పాఠశాలలో కళాశాలలు చెందిన విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు కార్యకర్తలు ముస్లిం సోదరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో భారీ చోరీ

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి ప్రశాంతనగర్‌లో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. బాధితుడు ఆదిని పూర్ణ సాయి తేజ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తమ ఇంటికి తాళం వేసుకొని 6వ తేది తన తల్లిదండ్రులు ప్రసన్నలక్ష్మి వెంకటరమణ లు తన తమ్ముడు చక్రధర సాయి పనిచేస్తున్న ఒరిస్సాకు వెళ్లడం జరిగింది. 11వ తేదీ సోమవారం ఉదయం యధావిధిగా తమ ఇంటి పనిమనిషి తమ ఇంటికి వచ్చి చూడగా తమ ఇంటి ప్రహరీ గోడ గేటుకు వేసిన తాళాలు అలాగే ఉండగా దుండగులు ప్రధాన తలుపుకు మందర గ్రిల్ గేటుకు వేసిన తాళాలను ఇంటి తలుపు తాళాలు పగలగొట్టబడి ఇల్లు తెలిసి ఉండటాన్ని పనిమనిషి గమనించింది. ఈ విషయాన్ని చుట్టుపక్కల వాళ్ళకు పనిమనిషి తెలపగా తమ పక్కింటి వాళ్ళు బెంగళూరులో ఉంటున్న పూర్ణ సాయి తేజకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. హుటాహుటిన చంద్రగిరిలోని తమ ఇంటికి చేరుకున్న పూర్ణ సాయి తేజ వచ్చి చూడగా ఇంటి గ్రిల్ గేటుకు తలుపుకు వేసిన తాళాలు పగలగొట్టబడి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా కబోర్డ్ లాకర్ లో తన తల్లి ఉంచిన సుమారు పది లక్షల రూపాయల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు, నగదు రు.50 వేలు కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రగిరి పోలీసులు వేలిముద్ర నిపుణులు సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్ణ సాయి తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన



విశాలాంధ్ర-నాయుడు పేట: నాయుడుపేట స్థానిక గురుకుల పాఠశాల నందు విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూమ్ వీడియో ద్వారా సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న వేధింపులు, మత్తుపదార్థాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహనకు జూమ్ మీటింగ్ ఎస్పీ సుబ్బరాయులు నిర్వహించారని డీఎస్పీ తెలిపారు. ఈ వారోత్సవాలలో ఎస్ఐ శ్రీహరిబాబు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటింటి చెత్త సేకరణ ప్రతిరోజూ పక్కాగా చేపట్టాలి

- కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ పక్కగా చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆరోగ్య శాఖ విభాగం అధికారులను ఆదేశించారు. గతవారం పి.జి.ఆర్.ఎస్. లో వచ్చిన వినతుల పరిష్కారం, నగరంలో పారిశుధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటి చెత్త సేకరణ పక్కగా నిర్వహించాలని అన్నారు. అన్ని వీధుల్లోకి వాహనాలు నిర్దిష్ట సమయంలో వెళ్లేలా, వాహనంతో పాటు శానిటరీ సెక్రటరీ వెళ్లేలా చర్యలు చేపట్టాలని అన్నారు. వాహనాలు మరమ్మతులు గురైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఉదయం ముందుగా జి.వి.పి. (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్) శుభ్రం చేయాలని అన్నారు. ఎక్కడైనా చెత్త సేకరణ జరగలేదని ఫిర్యాదులు అందితే ఆ ప్రాంతంలో సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్నుల వసూళ్లు ఆలస్యం చేస్తున్నారని, సకాలంలో వసూలు చేయాలని అన్నారు. ప్రతి సోమవారం ప్రజల నుండి వచ్చిన వినతులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని డైవైడర్ల లో మొక్కలు పెట్టి పచ్చదనం పెంచేలా చర్యలు చేపట్టాలని హార్టికల్చర్ ఆఫీసర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, రవి, సెక్రటరీ రాధిక, డిసిపి మాహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హాసీమ్, డి.ఈ.లు, సూపరింటెండెంట్లు, ఏసిపి లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

### టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా

## ఎస్.సత్య నారాయణ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీ(ఎఫ్ఏసీ) మరియు కమిషనర్ ఎస్.సత్యనారాయణ టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా సోమవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయంలోని బంగారు వాకిలి వద్ద టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అడిషనల్ ఈవో అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నెలవలకు వాకాటి పరామర్శ

విశాలాంధ్ర - నాయుడుపేట : తిరుపతి మాజీ పార్లమెంట్ సభ్యులు,సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యంను సోమవారం ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ,బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి పరామర్శించారు. నెలవల సుబ్రహ్మణ్యం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకుని తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. సమాచారం తెలుసుకున్న వాకాటి నారాయణరెడ్డి నెలవల నివాసానికి చేరుకుని ఆయనను పరామర్శించారు. నెలవల సుబ్రహ్మణ్యం పూర్తి ఆరోగ్యంగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఒకటి నారాయణరెడ్డి ఆకాంక్షించారు. ఆయన వెంట దేవారెడ్డి సుధాకర్ రెడ్డి ఉన్నారు.

## 30 సంవత్సరాలుగా దళితులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలి: సిపిఐ

**విశాలాంధ్ర - సూళ్లూరుపేట:** తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవ ర్గంలోని బుచ్చినాయుడు కండ్రిగ మండలం కాటూరు రెవెన్యూ గ్రామంలోని వేదాల శ్రీనివాసపురంలో దళితులు సాగు చేస్తున్న భూము లకు పట్టాలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంవద్ద ధర్నా పోరాట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారత కమ్యూ నిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్ని రాజ్ మాట్లాడుతూ.. వీఎస్‌పురం దళితులు సుమారు 30 సంవత్సర ముల నుండి సర్వే నంబర్ 340లో సుమారు 39 ఎకరాలను చెట్టు పుట్ట కొట్టే తీర్పుడి చేసుకుని సాగు చేసుకుంటూ ఉంటే బుచ్చినాయుడు కండ్రిగ రెవెన్యూ అధికారులు ఈ భూమిలోని సుమారు పది ఎకరాలు భూమికి అక్రమ పట్టాలు ఇవ్వడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. భూమిని ఒకరు సాగు చేస్తూ ఉంటే వేరొకరి పేరున పట్టాలు ఇవ్వడం అన్యాయమని చిన్ని రాజ్ అన్నారు. సాగు చేస్తున్న దళితులు శ్రీకాళ హస్తి కోర్టును ఆశ్రయించగా కోర్టు అప్పుడున్న రెవెన్యూ అధికారులను క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి నివేదిక సమర్పించమని కోరగా ఆ భూమిపై పట్టాలు పొందిన దళితులు భూమి సాగులో లేరని అక్రమ పట్టాలను రద్దు చేస్తూ కోర్టుకు నివేదిక సమర్పించారు. ఆ మేరకు కోర్టు కూడా సాగులో ఉన్న దళితులకే పట్టాలు ఇవ్వాలని సంబంధిత భూమి వారికే చెందుతుందని జడ్జిమెంట్ ఇవ్వడం జరిగింది. అయినా సంబంధిత రెవెన్యూ అధికారులు మళ్లీ అక్రమంగా పట్టాలు పొందిన వారి పేర్లను 101 అడంగల్లో పేర్లు నమోదు చేయడం వల్ల సాగులో ఉన్న వారికి పట్టాలు ఇవ్వకుండా కాలయాపన రెవెన్యూ అధికారులు చేస్తున్నారని సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి వారు క్షేత్రస్థా యిలో భూములను పరిశీలించి సాగులో ఉన్న దళితులకు పట్టాలు ఇవ్వాలని చిన్ని రాజ్ డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ దళితుల భూ సమస్యను సత్వరం పరిష్కరిం చకుండా ఉంటే బుచ్చినాయుడు కండ్రిగ మండల రెవెన్యూ అధికారి ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా పోరాట కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామానాయుడు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్ రెడ్డి. ఏఐటీయుసి సూళ్లూరుపేట నియోజకవర్గ కమిటీ కార్యదర్శి అధ్యక్షులు రమణయ్య, నాగేంద్ర, సిపిఐ సీనియర్ నాయకులు ఎం.పార్థసారథి ఎం.రమణయ్య ధర్నా కార్యక్రమానికి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు ఏఐటీయూసీ నాయకులు చంద్ర వీఎస్‌పురం గ్రామ నాయకులుశ్రీకృష్ణయ్య,వెంకటకృష్ణయ్య, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లాలో ఈ నెల 14 నుంచి ఇంటివద్దే క్యాన్సర్ నిర్ధారణా పరీక్షలు: కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లాలోఈ నెల 14 నుంచి ఇంటి వద్దే క్యాన్సర్ నిర్ధారణా పరీక్షలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జిల్లా వైద్యశాఖ అధికారులనుఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుండి జిల్లా కలెక్టర్ వైద్య ఆరోగ్య అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఈ నెల 14 నుండి ప్రతి ఇంటి నందు 18 సంవత్సరాలు నిండిన ప్రజలందరికీ అసంక్రమణ వ్యాధులలో బిపి, షుగర్, గుండె జబ్బులు, థైరాయిడ్ ,పక్షవాతం , బ్రెస్ట్ క్యాన్సర్ మొదలగు వాటికి వ్యాది నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. నిర్ధారణ పరీక్షల్లో వ్యాది నిర్ధారణ అయితే సులభంగా చికిత్స చేయవచ్చని, ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో క్వాలిటీగా స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ఈనెల 8, 9 తేదీలలో జిల్లాలోని పిహెచ్ సీ నందు సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పై పూర్తి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ నెల 12వ తేదీన నమూనాగా రెండు ఇండ్లను మెడికల్ ఆఫీసర్ స్క్రీనింగ్ చేయాలని, 13వ తేదీ ఆశా కార్యకర్తలు ఇంటింటికి కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 14 తేదీ నుంచి అసంక్రమణ వ్యాదుల నిర్ధారణ పరీక్షల నిర్వహణ ప్రారంభం అవుతుందని, సిహెచ్ఓ ,ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు రోజుకి ఐదు ఇండ్లు మాత్రమే స్క్రీనింగ్ ను క్వాలిటీగా చేయాలని తెలిపారు. కరపత్రాలు గోడపత్రికల ద్వారా ఇంటింటికి వెళ్ళినప్పుడు ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించాలని, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు తెలపాలన్నారు. ఈ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని సూపర్వైజర్ స్టాఫ్ మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. డి సి హెచ్ ఎస్ డాక్టర్ ప్రభావతి మాట్లాడు తూ.. ఎవరికైనా చెస్ట్ పెయిన్ ఉంటే వారిని 108 ద్వారా ఏరియా హాస్పిటల్ కు రెఫర్ చేసినట్లయితే ఈ సి జి ద్వారా నిర్ధారించిన అనంతరం రూ. 45,000 ఇంజక్షన్లు వేసి వారి ఆరోగ్యాన్ని సంరక్షించిన అనంతరం సంబందిత హాస్పిటల్ కి రెఫర్ చేయడం జరుగుతుందని, కావున ఈ విషయాలను మెడికల్ ఆఫీసర్లు ఎఎన్ఎంలకు సంబందిత సిబ్బందికి అవగాహన కల్పించడం ద్వారా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేసినవారవుతామన్నారు. ఈ జూమ్ కాన్ఫెరెన్స్ లో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఎంహెచ్ డాక్టర్ ప్రభావతీ దేవి, డాక్టర్ వెంకట ప్రసాద్, డాక్టర్ హనుమంతరావు, ఎన్ సి డి, ఆర్ బి ఎస్ కే ప్రోగ్రాం అధికారి డాక్టర్‌శిరీష, డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 38 వినతులు : కమిషనర్ ఎన్.మౌర్య

**విశాలాంధ్ర - తిరుపతి :** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కు 38 వినతులను వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ప్రజల నుండి వచ్చిన వినతులు ఆయా విభాగాల అధికారులు వెంటనే పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్లు అనిల్ కుమార్, నరసింహ ఆచారి కోరారు. మాస్టర్ ప్లాన్ రోడ్లకు తమ స్థలం ఇచ్చామని టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, డ్రెయినేజీ కాలువల్లో మురుగు తొలగించాలని, రవీంద్ర నగర్ లో డ్రెయినేజీ కాలువలు, తెలుగు గంగ నీరు సరఫరా చేయాలని, కోరమేనుగుంట లోని తమ ఇంటి వద్ద వర్షపు నీరు ఆగిపోతున్నదని పరిష్కారం చూపాలని, హరేరామ హరేకృష్ణ మార్గంలో కొంత మంది తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయడంతో తమకు వ్యాపారం జరగడం లేదని టిటిడి దుకాణదారులు, శ్రీనివాస సేతు నిర్మాణం వలన తమ దుకాణం వద్ద నీరు నిలిచి పోతున్నదని , నీటి పన్ను ఎక్కువగా వస్తోందని పరిష్కరించాలని నారాయణపురం కు చెందిన నగేష్ కోరారు. అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన కమిషనర్ ఆయా విభాగాల అధికారులకు అర్జీలను కేటాయించారు. అన్ని అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, థులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, డి.సి.పి. మహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డి . ఈ.లు, ఏ.సి.పి.లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.